# పూలపరికిణీ

కొట్నం, పుణ్యావాచనం, కాశీ ప్రయాణం యావత్తు కర్మకలాపమంతా నిర్వర్తించి పెళ్ళికొడుకు రామారావు తుల్జా భవనానికి వొచ్చేవరకు సాయంత్రం ఆరుఘంటలైంది. భాషికాల యుక్తంగా బస్సుదిగి, లోపలి కెళ్ళి జంపుఖానామీద కూచునేసరికి విడిదంతా బంధువర్గంతో కిటకిట లాడుతున్నట్టు తోచింది. రెండు నిమిషాలు సేదదీర్చుకొని, భాషికాలు పౌరోహితుడికి అప్పజెప్పి విడిదంతా వోహమాటు చుట్టివత్తామన్న ఉద్దేశంతో కోటువిడిచి బయల్దేరాడాతను.

తుల్జా భవనం కాచీగూడా స్టేషన్‌కి దాదాపు రెండు ఫర్లాంగుల దూరంలో వుంటుంది. భవనం విశాలంగా వుండటంవల్ల హైద్రాబాదులో జరిగే వివాహాలల్లో ముప్పాతిక మువ్వీసాలవరకూ అక్కడనే జరుగుతూ వుంటాయి. అది దేవతాస్థలంకాబట్టి, ధనాభావంవల్ల నాలుగు రోజులు అట్టహాసంగా పెళ్ళిచేయడానికి ఇష్టంలేని మహాశయులంతా ఒక్కరోజులో "గపుచుపు"గా వివాహం చేసేసుకోవచ్చుననే ఉద్దేశ్యంతో సాధారణంగా అక్కడ పోగవుతూవుంటారు.

రామాలయంముందు వివాహమంటపం రంగురంగుల విద్యుద్దీపాలతో, అరటి స్థంభాలతో, పచ్చని తోరణాలతో, జాజ్వల్యమానంగా ప్రకాశిస్తూవుంది. ముత్తైదువులూ, బ్రాహ్మలూ, నానా గందరగోళంగా ఆ మంటపంచుట్టూ యేదోపనిమీద హడావుడిగా తిరుగుతున్నారు. ఎటు చూచినా భవనమంతా జనసమర్ధంతో చాలా గడిబిడగావుంది. రామారావు తిన్నగా అనాలోచితంగా ఆ మంటపంవేపు బయల్దేరాడు.

రెండడుగులు ముందుకు వేశాడో లేదో ఒహ అమ్మాయి దారికి మధ్య అతనికి ఎదురుపడి "ఏంరా రామూ బాగున్నావా?" అంది. రామారావు తలెత్తి ఆ అమ్మాయిని ఆపాదమస్తకం వొక్కమాటు తీక్షణంగా కలయచూచాడు. మనిషి యెవరో పోల్చుకోవటం అతనికి తలకు మించిన పని అయింది. "అత్తవారివేపు బంధువులు యెవరన్నా అయివుంటారా" అని ఆలోచించాడు. ఎంత ఆలోచించినా అతనికి ఏమీ పాలుపోలేదు. పనిమీద వెడుతోన్న ఆఅమ్మాయిని అట్టే ఆపటం యిష్టం లేక ప్రయత్నపూర్వకంగా "ఆ, క్షేమంగా వున్నానండీ, మీరంతా క్షేమంగా వున్నారా?" అన్నాడు.

ఆ అమ్మాయి ఔనన్నట్టు తలూపి "పనుంది, మళ్ళీ కలుసుకుంటానని" చెప్పి మెరుపుమల్లే అదృశ్యమైపోయింది.

రామారావు ఆ తరువాత మిత్రులతో కలుసుకొని మళ్ళీ మంగళ స్నానాలవరకూ ఆ విషయమే మరచిపోయినాడు.

*   *   *   *

ఎదురుకోళ్ళు బుక్కాగులాల్లతో మహావైభవంగా జరిగిపోయింది. ఆ తరువాత దాదాపు రెండు గంటలకి రామారావుకి స్నానానికి కబురు వొచ్చింది. పట్టువిప్పి మిత్రులదగ్గర శలవు తీసుకొని, నలుగుపెట్టే స్థలానికి పనిమనిషిలో వెళ్ళేసరికి, మళ్ళీ ఆ అమ్మాయి అక్కడ ప్రత్యక్షమయింది.

"ఏంరా రామూ, యింత ఆలస్యం చేశావూ? ఇంకా పెళ్ళి కాకపోయినా అప్పుడే మాఅబ్బాయికి పెళ్ళికొడుకుదర్జా ఒచ్చేసిందే," అంది.

రామారావు మౌనం వహించాడు. ఆ అమ్మాయి తనపైన అవ్యాజంగా చలాయిస్తూవున్న అధికారంచూచి అతనికి చాలా ఆశ్చర్యమేసింది. మనిషేమో బొత్తిగా అపరిచితురాలు. ఇదివరలో యెప్పుడూ ఆ అమ్మాయిని చూచినట్టు జ్ఞాపకంలేదు. పెళ్ళికూతురికి—ఒక్కడే ఒక్క—

తమ్ముడుతప్ప—తక్కిన అక్కచెల్లెండ్లు ఎవరూ లేరన్నసంగతి అతనికి బాగా తెలుసు. ఘాటైన జవాబు చెబుదామనుకుంటే నలుగురిలో తనకే అభాస అవుతుందని తెలుసుకొని, మౌనం వహించి, తనకోసం నిర్దేశింపబడిన పీటమీద, ఆలోచనా దొంతరలమధ్య వెళ్ళి చతికిలబడ్డాడు.

ఆ అమ్మాయి రామారావుకి, ఫాలభాగంలో పొడుగాటి కుంకుమ బొట్టుపెట్టి, మంగళహారతిచ్చి అక్కడినించి మళ్ళీ అదృశ్యమయిపోయింది.

పనిమనిషి రామారావుకి నలుగుపెట్టింది. ఆరాత్రి ఒకటే ఈదర గాలి. చలికి గిజగిజ లాడుతూ, తొందరగా నలుగు పూర్తిచేసుకొని, టవల్ ధోవతీ తీసుకొని పెరట్లో భావిదగ్గర స్నానానికి బయల్దేరాడాతను. అక్కడకూడా ఆ అమ్మాయే నీళ్ళు తోడుతూవుంది. పమిట నడుముకి బిగించి విలాసంగా భావిలో చేదేసి, ఒయ్యారంగా బొక్కెన్ని లాగుతో వున్న ఆ సౌందర్యాన్ని చూచి రామారావు చకితుడైనాడు.

వంటశాల రామాలయానికి వెనకాలవుంది. తుల్జా భవనంలో మధ్య గుడి, దానిచుట్టూ కొంచెం ఖాళీప్రదేశం, ఆచుట్టూ గదులన్నీ వరుసగా అమర్చివున్నాయి. ఆలయంముందువేపు ఒహ బంగళా, వెనకాల వంటశాల, బావీ, పైపూ అవీ వున్నాయి. వంటశాలలో వంటలవుతూ వుండటంవల్ల ఆ కట్టెల మంటకి కొంచెంగా వెలుతురు బావివేపు ప్రసరించినా ఆ ప్రదేశంమాత్రం యింకా మసకమసకగానేవుంది.

బావిని సమీపించి రామారావు గంగాళంలోంచి చెంబుతో నీళ్ళు తీసుకుని, ఒంటిమీద పోసుకోవడం ప్రారంభించాడు. అతను స్నానం చేయటం మొదలుపెట్టిందే తడవుగా ఆ అమ్మాయి బావిలో చేదవేయటం మానేసి సబ్బు, నెత్తిమసాలా అన్నీ దగ్గరికి అమర్చిపెట్టింది. అవకాశం దొరికిందే తడవుగా దగ్గరలో మనుషులెవరూ లేకపోవడంవల్ల రామారావు ఆ అమ్మాయిని ఒళ్ళు తెలియని పారవశ్యంలో తేరిపార చూడటం మొదలెట్టాడు.

ఆ అమ్మాయి దాదాపు పదహారేళ్ళుంటుంది. కోలమొహం, పల్చని చెంపలూ, మాటిమాటికీ అప్రయత్నంగా కొట్టుకునే ఆదీర్ఘమైన కనురెప్పలూ--అతన్ని చప్పున ఆకర్షించాయి. రామారావు మంత్రముగ్ధుడై ఆ మొహాన్ని దీర్ఘంగా విలోకించడం మొదలెట్టాడు. సాధారణంగా పసిపిల్లల్లోకూడా వుండని అమాయకత్వం కళ్ళద్వారా ప్రస్ఫుటంగా బయలుపడుతూవున్న ఆ అమ్మాయిలోని చంచలత్వం అతన్ని వివశుణ్ణి చేసింది. ఒళ్ళు తెలియని ఆనందంలో అతను తన్మయుడైపోయినాడు.

"కళ్ళు మూసుకో తల రుద్దుతా."

పై వాక్యం అతన్ని ఆ ఆనందమయ సమాధిలోంచి కదిల్చింది. మళ్ళీ అనాలోచితంగా అతనికళ్ళు మూతలు పడ్డాయి. తల ఏవో మృదు మధుర హస్తాలకోసం అప్రయత్నంగా ఎదురుచూచింది.

రామారావుకి మెదడులో అంతూపంతూ లేని ఒకటే ఆలోచన___

ఈ అమ్మాయి ఎవరై వుండొచ్చు...యిదివరలో ఆమె తనని ఎరిగి వుండవచ్చునా?...ఏమొ...తనకిమాత్రం ఆ అమ్మాయిని ఇదివరలో చూచినట్టు జ్ఞాపకం రావటంలేదే...తనని యిదివరలో ఎరిగివుండకపోతే మనషి తనపైన ఇంత అధికారమెందుకు చలాయిస్తుంది...ఏమో...అంతా అయోమయం......

రామారావు ఏమీపాలుపోక విభ్రమంలో పడిపోయాడు. స్నానం ఎల్లాచేశాడో ఏమో అతనికే తెలియదు.

తెల్లవారుజామున నాలుగు గంటలకి పెళ్ళి అయిపోయింది మర్నాడు మధ్యాహ్నం విందు పూర్తిచేసుకొని ఆరోజు సాయంత్రమే పెళ్ళివారు ఖైరతాబాదకు బయల్దేరారు.

* * * *

రెండురోజులు గడిచాయి. పెళ్ళికూతురు అత్తవారింటికి ప్రేమావతీ పేట వెళ్లిరావడమూ సత్యనారాయణకథా, అంతా సలక్షణంగా జరిగి పోయినాయి. మూడోనాడు సాయంత్రం భోజనాలు అవీ పూర్తిచేసుకొని పెళ్ళివారు రామారావుతో సహా పెళ్ళికొడుకుమామ రామనాథంగారు ఉద్యోగం చేస్తోవున్న గ్రామానికి బయల్దేరారు బస్సులో—

బస్సు ఖైరతాబాదనించి బయల్దేరేవరకే సాయంత్రం ఎనిమిది ఘంటలైంది. సికిందాబాదులో మోటరువాడు పెట్రోలు పోయించుకో డానికి బస్సు ఆపాడు. బయల్దేరటమే ఆలస్యంగా బయల్దేరి, మొదట్లోనే హంసపాదు అన్నట్లు సికింద్రాబాదులోనే బస్సు పదిహేను నిమిషాల వరకూ ఆగేసరికి రామారావుకు ఒళ్ళు మండుకొచ్చింది. కాని బస్సులో అంతా అత్తవారివేపువాళ్ళే వుండటంవల్ల అప్పట్లో అతనికి గంభీరించక తప్పిందికాదు.

మళ్ళీ బస్సు సాగింది. అది కార్తీకమాసం—మంచి చలిరోజులు. సికింద్రాబాదువొదిలి బస్సు నిర్జన ప్రదేశంలో రయ్యిమంన వెడుతూవుంటే చలికి రామారావు శరీరమంతా—వొక్క రామారావేమిటి బస్సులో వున్నవాళ్ళ శరీరాలన్నీ—ములికలు పొడిచినట్లయినాయి. కోటుకాలరు ఛాతీకి నిండుగా కప్పేసుకుని "యింక యెంత చలివేసినా నన్నేమీ చేయ దన్నట్లు" ధాటీగా బస్సులో కూర్చున్నాడు రామారావు.

బస్సు కామారెడ్డికి షుమారు పన్నెండు గంటలకి చేరుకుంది. యిక గంట గంటన్నరలో గమ్యస్థానం చేరుకోవచ్చుననే ధీమాతో బస్సులో వున్నవాళ్ళ హృదయాలు తేలికపడ్డాయి.

చలి యెక్కువవుతున్నకొద్దీ రామారావు శరీరాన్నంతా కుప్పగా చేసి పాదాలయుక్తంగా తన సీటులో వొక్కచోటికి చేర్చుకున్నాడు వెంట నంటుతూవున్న గాలి హోరుతప్ప బస్సులో కూర్చున్నవాళ్ళకి యితరములేవీ వినపడడంలేదు.

అర్ధగంట తరువాత వోహా కీకారణ్యంలో బస్సు ఆగింది. డ్రైవర్ దిగి మెషిన్‌ని వోహ పదినిమిషాలవరకు పరీక్షించి పెట్రోలు లేదని తేల్చేశాడు—డ్రైవరుని ఎంత కోప్పడితేమాత్రం యేమిలాభం. పెళ్ళివారు కామారెడ్డిదాటి పన్నెండుమైళ్ళు వొచ్చారు. వొక్క కామారెడ్డిలోతప్ప పరిసర ప్రాంతాల్లో యెక్కడా పెట్రోలు దొరకదు. డ్రైవరుని కోప్పడి లాభంలేదని తెలుసుకొని రామనాథంగారు తిన్నగా వాణ్ణి కామారెడ్డికి పెట్రోలుకోసం కాలినడకని పంపించారు.

బస్సు పక్కనే ఆరోడ్డుమీద వొక్కటే ఒక్కపక్కవేసి పిల్లలందరినీ పడుకోబెట్టారు. ఆ చలిలో పెద్దవాళ్ళకి వొక్కరికీ నిద్రరాలేదు. రామనాథంగారు అక్కడక్కడి యెండుపుల్లల్ని భోయిచేత ఏరించి మంట వేయిస్తే వొక్క రామారావు అత్తగారుతప్ప తక్కినవాళ్ళంతా ఆ మంట చుట్టు వొక్కరొక్కరే నెమ్మదిగా చేరుకున్నారు.

రామారావు మళ్ళీ ఆ మంట వెలుతురులో ఆ అమ్మాయిని పసిపట్టాడు. ఆ బరువు కళ్ళూ, ఆ చెదిరిన వెంట్రుకలూ, యెంత కాపుకున్నా చలికి కొంకర్లు పోతూవున్న ఆ అమ్మాయి చేతుల్నిచూచి అతనికి జాలేసింది. అయిదు నిమిషాలముందే కప్పుకున్న, తన వొంటిమీది "శాలువ"ను తీసి "మీరు తీసుకోండి, నాకు అసలు చలెయ్యటమే లేదు" అని ఆ అమ్మాయికి అందిచ్చాడు. నిస్సంకోచంగా శాలువ అతని చేతుల్లోంచి అందుకొని, చివరకి మాటవరుసకైనా కృతజ్ఞత చెప్పకుండా ఆ అమ్మాయి కప్పుకోవటాన్నిచూచి రామారావుకి ఆశ్చర్యమేసింది. అక్కడ ఆమెను ఆ తరువాతగూడా మాటాడించడానికి అవకాశం లేక రామారావు నిశ్శబ్దంగా లేచి బస్సులోకెళ్ళి ముందుసీటులో పడుకొని "యింత చనువుగా ప్రవర్తిస్తూవున్న యీ అమ్మాయి యెవ్వరా" అన్న ఆలోచనలలో మునిగిపోయినాడు.

మర్నాడు మధ్యాహ్నం వొంటిగంటకల్లా బస్సు నారాయణపురం చేరింది.

భోజనాలయిన తరువాత క్రిందటిరాత్రి నిద్రచాలకపోవటంవల్ల రామారావు వెళ్ళి బంగళాపైన పడుకున్నాడు.

* * * *

సాయంత్రం అయిదు గంటలకి కళ్ళువిప్పి, నిద్రమాంద్యంవల్ల మంచంమీద మసులుతూ వుండగా బంగళాపైన మళ్ళీ ఆ అమ్మాయి ప్రత్యక్షమయింది. తలకు పోసుకొని వెంట్రుకలు ఆరేందుకు వొదులుగా వేసుకున్న ఆ జడనీ, జడలో యిముడక నుదుట్లో గాలికి గంతులేస్తోవున్న ఆ ముంగుర్లనీ చూచి రామారావు హృదయంలో చెప్పరాని ఆందోళన బయలుదేరింది. యేదో అవ్యక్తమయిన ఆవేదన తనను దహించేస్తోవున్నట్లు అతనికి తోచింది. ఆవేశాతిశయంవల్ల అతని కళ్ళు విస్ఫులింగాలకిమల్లే ప్రకాశించటం మొదలెట్టాయి.

"రామూ! నిన్ను టీకి పిలుస్తున్నారురా"

రామారావుకి ఆమాటలకి అర్థం తెలియలేదు. తెలుసుకుందామనే ప్రయత్నంకూడా చేయకుండా "నాకు కొంచెం నూనే, దువ్వెనా తెచ్చి పెడుదూ" అన్నాడు.

నోటినించి మాటలు వెలువడిందే తడవుగా ఆ అమ్మాయి మళ్ళీ మాయమై తృటికాలం తరువాత మెరుపుకు మల్లే ఆ గదిలో నూనే దువ్వెనతో వెలిసింది. సవిలాసంగా చేతిని ముందుకు పోనిచ్చి రామారావు ఆమె మునివేళ్ళని తాకుతూ ఆమె చేతుల్లోంచి నూనెసీసా, దువ్వెనా తీసుకున్నాడు. ఆమె వేళ్ళద్వారా అతని శరీరంలో ఏదో విద్యుచ్ఛక్తి ప్రవేశించి అతని రక్తనాళాల్లో కలియబారింది. అతనికి తెలియకుండానే, మెదడు అప్రయత్నంగా గిర్రున తిరిగింది.

"అద్దం"

ఆమె అద్దంకోసం వెళ్ళి తిరిగి వొచ్చేలోపల మళ్ళీ అతనేమీ ఆలోచించలేకపోయాడు. తల దిమ్మెక్కింది. మెదడులో ఆమెను గూర్చిన భావాలన్నీ వొక్కుమ్మడిగా అదృశ్యమయిపోయినాయి.

అద్దంకోసం చేయిచాచి ఆమె కోమల హస్తాన్ని వొళ్ళు తెలియని ఆవేశంతో గట్టిగా నొక్కాడు.

రామారావు ఆందోళనంతా ఆమెకి చప్పున కళ్ళకి కట్టినట్టు అర్థమైంది. "రామూ, నీకేమన్నా జ్ఞానముందా, లేదురా, యేదో చిన్నప్పుడు నాతో ఆడుకున్నావనే ఉద్దేశ్యంతో చనువుగా మెలిగితే, ఆ చనువుకి ఇదా ఫలితం......మహా నేర్చుకు పోయావులే......నీ రవణ తోనేనా నీ విల్లా ప్రవర్తించేది......"

"రవణ" "రవణ" అని రామారావు శూన్యంలోకి చూస్తూ రెండు మాట్లు నోట్లోనోట్లో గొణుక్కున్నాడు.

అతనికి చప్పున ఆ చిన్ననాటి "రవణ" జ్ఞాపక మొచ్చింది. ఆ పూలపూల పరికిణీ, ఆ చింపిరిజుట్టూ, మాటిమాటికీ వొకటే పనిగా మూతలుపడే ఆ కనురెప్పలూ, అవన్నీ మెరుపుతునల్లే అతని కళ్ళముందు మెరిసాయి. ప్రయత్నపూర్వకంగా ఆ అఖాతంలోంచి తన దృక్కుల్ని గుంజుకొని ఆ అమ్మాయివేపు ముహూర్తకాలం ఏకాగ్రంగా చూచాడు.

అవేకళ్ళు, అదేమొహం—ఆ ఎనిమిది సంవత్సరాలక్రితం రవణతోటి కూడుకున్న రామారావు జీవితం వొక్కుమ్మడిగా సినిమాకి మల్లే అతని కళ్ళముందు తిరిగింది.

"రవణా! రవణా! ఎనిమిది సంవత్సరాల్లోనే యెంత మారిపోయావే" అంటూ రామారావు ఆశ్చర్యపూర్వకంగా మంచంలో చతికిలబడ్డాడు.